క్లుప్తంగా

గాలి పటాల పోటీలు



పామర్రు: సంక్రాంతిని పురస్కరించుకుని స్థానిక అసీస్సీ హైస్కూల్ ఆవరణలో శుక్రవారం రంగవల్లులు, గాలి పటాల పోటీలను ఉల్లాసంగా ఉత్సాహంగా నిర్వహించారు. పండుగ సంప్రదాయాన్ని పురస్కరించుకుని విద్యార్థులతో గాలిపటాలను ఎగుర వేసినట్లు హైస్కూల్ ప్రిన్సిపాల్ సిస్టర్ వలసా సబాస్టియన్, కరస్పాండెంట్ సిస్టర్ రోజ్‌థామస్ తెలిపారు. అదేవిధంగా విద్యార్థినులకు రంగవల్లుల పోటీలను నిర్వహించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల పీఈటీ మట్టా గ్లాడిసన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గోదాదేవికి చందన అలంకారం



పామర్రు: మండలంలోని పెరిశేపల్లిలో వేంచేసి యున్న పద్మావతీ సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలోని గోదాదేవికి శుక్రవారం చందన అలంకారం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి విశేషంగా ప్రసాదాలను నివేదనలు చేశారు. ఆలయ ధర్మకర్తలు చెరుకూరి వెంకట రత్న గిరిబాబు పాల్గొన్నారు.

డబ్బా పంపు ఏర్పాటు పనులు ప్రారంభం

తోట్లవల్లూరు: బొడ్డపాడులో డబ్బా పంపు ఏర్పాటు పనులను సర్పంచ్ మూడే శివశంకర్ రావు శుక్రవారం ప్రారంభించారు. రైతులకు తాగునీటి అవసరాలు తీర్చేందుకుగానూ పల్లపు కాల్వ వద్ద రూ.1.25 లక్షలతో డబ్బా పంపు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. నాయకులు కనగాల వెంకట సత్యనారాయణ, నిమ్మగడ్డ సీతారాంబాబు, బీరం విజయ రామ్మోహనరావు, మసిముక్కు శ్రీనివాసరావు, సూర్యదేవర శ్రీధర్ పాల్గొన్నారు.

అలరించిన ఏకనామ సంకీర్తన

పామర్రు: స్థానిక సీతారామాంజనేయస్వామి ఆలయంలో ఏకాదశిని పురస్కరించుకుని ఏకనామ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఏకాదశి సందర్భంగా ఆలయంలో హరే రామ హరే రామ, హరే కృష్ణ హరే కృష్ణ అనే సంకీర్తన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు 24 గంటలు ఈ నామాన్ని ఆపకుండా పూర్తిగా నిర్వహించడం విశేషం. ఆలయంలో పూజా కార్యక్రమాలను అర్చకులు ఆర్ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. సర్పంచ్ చంద్రశేఖర్‌రావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జూదాల శిబిరాన్ని అడ్డుకున్న అధికారులు

గుడివాడరూరల్: సంక్రాంతిని పురస్కరించుకుని జూదాలు నిర్వహించేందుకు అధికార పార్టీ నాయకులు ఏర్పాటు చేస్తున్న శిబిరాన్ని రెవెన్యూ, పోలీస్ అధికారులు అడ్డుకున్నారు. మండలంలోని బొమ్ములూరు సమీపంలో ఉన్న టిడ్కో సముదాయం వద్ద కోడిపందేలు, పేకాట నిర్వహించేందుకు టెంట్లు ఏర్పాటు చేస్తున్నారనే సమాచారంతో రెవెన్యూ, పోలీస్ అధికారులు ఆ ప్రాంతానికి చేరుకుని టెంట్‌లు తొలగించి అధికార పార్టీ నాయకులకు శుక్రవారం నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రామ కోటేశ్వరరావు, తాలూకా ఎస్ఐ ఎస్.చంటిబాబు మాట్లాడుతూ కోడిపందేలు, ఇతర జూదాలు నిర్వహించకుండా ముందస్తుగానే గ్రామ, మండలస్థాయి కమిటీలను ఏర్పాటు చేశామన్నారు.

సీపీఎం నాయకుడి మృతికి సంతాపం

పామర్రు: స్థానిక కార్పెంటర్ కాలనీలో సీపీఎం నాయకుడు ఇటికల ఏసుపాదం శుక్రవారం గుండె పోటుతో మృతి చెందారని ఆ పార్టీ మండల కార్యదర్శి గంగాధర ప్రసాద్ తెలిపారు. ఆయన మృతికి సీపీఎం మండల కమిటీ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయన కుటుంబాన్ని . నాయకులు ముళ్లపూడి విల్సన్, పెదబాబు, రాజు, నాగ భూషణం తదితరులు పరామర్శించారు.

జాబ్ మేళాలో 21 మందికి ఉద్యోగాలు

కైకలూరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త అధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో జాబ్‌మేళా శుక్రవారం నిర్వహించారు. మేళాలో 21 మంది పలు కంపెనీల్లో కొలువులకు ఎంపికయ్యారు. జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్.శాంతి జ్యోతి, ఏలూరు జిల్లా నైపుణ్యభివృద్ధి సంస్థ అధికారి ఎస్. జితేంద్రబాబు పాల్గొన్నారు.


మంచినీటి పథకాల పరిశీలన

కైకలూరు: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదుపై కలెక్టర్ ఆదేశాలతో పెంచికలమర్రు వాటర్ స్కీంను ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ త్రినాథబాబు శుక్రవారం సందర్శించారు. ఆలపాడుకి చెందిన బండి శ్రీనివాసరావు ఇటీవల కలెక్టర్ కార్యాలయంలో పెంచికలమర్రు స్కీం నుంచి ఏడు గ్రామాలకు నీటిని సరఫరా చేయాల్సి ఉందని, కేవలం రెండు గ్రామాలకు నీటిని అందిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పరిశీలించిన ఎస్ఈ త్రినాథబాబు సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు.

యథేచ్ఛగా బెల్టు షాపుల నిర్వహణ

గుడివాడ నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో మద్యం బెల్టు షాపులను యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. ఈ దుకాణాలు వైన్‌షాపుల యజమానుల కనుసన్నల్లోనే సాగుతున్నాయి. వీటిని నిర్వహించేది కూడా అధికార పార్టీ నేతలే. సంబంధిత అధికారులు మామూళ్ల మత్తులో జోగుతూ చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

గ్రామాల్లో ఎటుచూసినా మద్యం విక్రయాలు



పోలుకొండలో నిర్వహిస్తున్న బెల్టుషాపు



జనార్దనపురంలో వైన్‌షాపు వద్ద నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన సిట్టింగ్

గుడివాడరూరల్: నియోజకవర్గంలోని గుడివాడ, నందివాడ, గుడ్లవల్లేరు మండలాల్లో ఉన్న గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం బెల్టు షాపులు నిర్వహిస్తున్నారు. దాదాపు 70నుంచి 80కు పైగా బెల్టుషాపులు ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. వీటి ద్వారా నెలవారీ రూ.3.50 లక్షల నుంచి రూ.4లక్షల వరకు అధికార పార్టీ నాయకులు వసూలు చేస్తున్నట్లు వినికిడి. బెల్టుషాపు పెట్టుకునేందుకు ముందుగా రూ.50 వేలు నిర్వాహకుడి వద్ద నుంచి నేతలు వసూలు చేసి నెల నెలా ఒకటో తేదీ కల్లా రూ.5 వేలు చెల్లించేలా ఒప్పందం చేసుకున్నట్లు సమాచారం.

ఏరులై పారుతున్న మద్యం

గ్రామాల్లో ఎటుచూసినా మద్యం ఏరులై పారుతోంది. వీధివీధినా ఎక్కడ చూసినా బెల్టుషాపులే దర్శనమిస్తున్నాయి. వైన్‌షాపుల యజమానుల అండదండలతో అధికార పార్టీ నేతలే నిర్వాహకులుగా మారి మద్యాన్ని అడ్డగోలుగా అమ్ముతున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా మద్యం అమ్మకాలను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. బెల్టుషాపులపై ఉక్కుపాదం మోపాలని స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలు ఇచ్చినా ఆ పార్టీ నేతలే షాపుల యజమానులతో కలసి ఆదేశాలకు తూట్లు పొడుస్తున్నారు. మద్యం అమ్మకాలను అడ్డుకోవాల్సిన ఎక్సైజ్‌శాఖ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారు. విచ్చలవిడిగా మద్యం అమ్మకాలపై మహిళలు, ప్రజా సంఘాలు మండిపడుతున్నారు.

అడ్డగోలుగా బెల్టుషాపులు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో ప్రభుత్వమే మద్యం షాపులను నిర్వహించేది. గ్రామాల్లో బెల్టుషాపులు మచ్చుకైనా కనపడేవి కావు. షాపుల్లో ఒక వ్యక్తికి మూడు క్వార్టర్ సీసాల మద్యం మాత్రమే ఇచ్చేవారు. అక్రమంగా పరిమితికి మించి ఎవరైనా మద్యాన్ని తరలిస్తే అధికారులు దాడులు చేసి వారిపై చర్యలు చేపట్టేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మద్యం అమ్మకాలకు అడ్డే లేకుండా పోయాయి. ప్రైవేట్ యజమానులకు వైన్‌షాపుల బాధ్యతలు అప్పగించడంతో లాభాల కోసం అడ్డగోలుగా అమ్మకాలు సాగిస్తున్నారు. షాపుల్లో ఇష్టమొచ్చినట్లు పరిమితి లేకుండా మద్యాన్ని అమ్మేస్తున్నారు. వైన్‌షాపుల యజమానుల మద్దతుతో టీడీపీ నేతలే గ్రామాల్లో పుట్టగొడుగుల్లా బెల్టుషాపులు ఏర్పాటు చేసి అడ్డగోలుగా అమ్మకాలు చేస్తున్నారు. నందివాడ మండలంలో మూడు షాపులు ఎమ్మెల్యే అనుచరులు, పోలుకొండలో మరో షాపును ఎంపీ పేరుతో నిర్వాహకులు నిర్వహిస్తే షాపుల వద్దే సిట్టింగ్‌లు ఏర్పాటు చేసి అడ్డగోలుగా అమ్మేస్తున్నారు. మరికొందరు ఏకంగా మంత్రి నారా లోకేష్ పేరు చెప్పి మరీ అమ్మకాలు సాగిస్తున్నారు. ఇప్పటికైనా ఈ అడ్డగోలు మద్యం అమ్మకాలను అడ్డుకుని బెల్టుషాపులను నియంత్రించాలని మహిళలు, ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా ముక్కోటి ఏకాదశి



జమీదగ్గుమిల్లిలో ఉత్తర ద్వారం వద్ద పూజలు



మీసాల వెంకన్నస్వామిని దర్శించుకున్న డీఎన్నార్



దోకిపర్రులో ఉత్తర ముఖ దర్శనమిచ్చిన వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



మంటాడ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఉత్తర ద్వార దర్శనం

ఉత్తర ద్వారం వద్ద ఉత్సవమూర్తుల దర్శనం

పామర్రు: మండలంలో ముక్కోటి ఏకాదశిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పలు వైష్ణవ ఆలయాల్లో శుక్రవారం ఉత్తర ద్వారం వద్ద ఉత్సవ మూర్తులను వేంచేపు చేసి భక్తులకు దర్శనమిచ్చారు. మండలంలోని జమీదగ్గుమిల్లిలోని శ్రీ సీతారామాంజనేయస్వామి ఆలయంలో తెల్లవారుజాము నుంచి పూజలు నిర్వహించారు. పామర్రులోని విష్ణాలయంలో ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాల స్వామిని ఉత్తర ద్వారం వద్ద ఉంచి విశేష పూజలు చేశారు. స్థానిక అంకమ్మతల్లి ఆలయంలో అమ్మవారిని ఉత్తర ద్వారం వద్ద ఉంచి విశేష పూజలు చేశామని ఆలయ కమిటీ సభ్యులు వరదా అప్పారావు తెలిపారు.

పమిడిముక్కలలో..

పమిడిముక్కల: మంటాడ వెంకటేశ్వరస్వామి దేవస్థానం శుక్రవారం భక్తులతో కిటకిటలాడింది. వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామి వారి ఉత్తర ద్వార దరన్శం చేసుకుని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం స్వామి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ ఈఓ మాధవీలత, సాయి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

తోట్లవల్లూరులో..

తోట్లవల్లూరు: తోట్లవల్లూరులోని శ్రీరుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అర్చకులు విజయకుమార్ ఆచార్యులు, ఉగ్రనరశింహాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారు శుక్రవారం వేకువజామున భక్తులకు ఉత్తరద్వారం ద్వారా దర్శనమిచ్చారు. అనంతరం గ్రామోత్సవం జరిగింది. ఆలయ ఈఓ హరి దుర్గా నాగేశ్వరరావు ఆయా కార్యక్రమాలను పర్యవేక్షించారు.

మొవ్వలో..

పెదముత్తేవి(మొవ్వ): మొవ్వ మండలంలో శుక్రవారం ముక్కోటి ఏకాదశి వేడుకలతో పాటు ఉత్తర ద్వార దర్శనాలు నిర్వహించారు. పెదముత్తేవి శ్రీ కృష్ణాశ్రమంలో ముముక్షుజన మహా పీఠాధిపతి ముత్తేవి గౌర కృష్ణగురూజీ ఆధ్వర్యంలో భక్తులు ఉత్తర ద్వార దర్శనం ద్వారా వైకుంఠ నాథస్వామిని వీక్షించారు. కూచిపూడి రుక్మిణీ సత్యభామ సమేత రాజగోపాలస్వామి మందిరంలో ఉత్తర ద్వార దర్శనంతో పాటు సుదర్శన హోమం నిర్వహించారు.

కైకలూరులో..

కైకలూరు: ధనుర్మాస మహోత్సవాల్లో వైకుంఠ ఏకాదశి సందర్భంగా కైకలూరులో మీసాల వెంకన్నగా ప్రసిద్ధి చెందిన భూ సమేత వేంకటేశ్వర స్వామి ఉత్తర ద్వార దర్శనంలో గరుడ వాహనంపై భక్తులకు శుక్రవారం దర్శనమిచ్చారు. వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) సతీసమేతంగా స్వామిని దర్శించుకున్నారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, నాయకులు అప్పారావు, మాల్యాద్రి, రాజీ, కెవీఎస్ఎం.నాయుడు, ఉదయశంకర్ స్వామిని దర్శించుకున్నారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: ముక్కోటి ఏకాదశి సందర్భంగా గురజ వేణుగోపాలస్వామి, వడాలి జగన్నాథస్వామి ఆలయాల్లో ఈఓ శింగనపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఉత్తరద్వార దర్శనాలు ఏర్పాటు చేశారు. శుక్రవారం వేకువజామునే అనేకమంది భక్తులు ఆలయాలకు చేరుకుని స్వామిని దర్శించుకుని పూజలు చేశారు.

మండవల్లిలో..

మండవల్లి: ముక్కోటి ఏకాదశి పురస్కరించుకుని శుక్రవారం స్థానిక వేంకటేశ్వర ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. స్వామిని ఉత్తర ద్వారం ద్వారా దర్శించుకున్నారు.

గుడ్లవల్లేరులో..

దోకిపర్రు(గుడ్లవల్లేరు): భూ సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శుక్రవారం ముక్కోటి ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్వామికి మెయిల్ అధినేతలు, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వెంకటకృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారు ఉత్తర ముఖ ద్వార దర్శనమిచ్చారు. గుడ్లవల్లేరు శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి ఉత్తర ముఖ ద్వారం ద్వారా భక్తులకు దర్శనమిచ్చారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గుడివాడ టౌన్: విద్యుత్ లైన్‌లు, సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఈఈ జీబీ శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు గుడివాడ, పెదపారుపూడి సబ్ స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

గుడ్లవల్లేరు: విద్యుత్ సబ్ స్టేషన్ మెయింటెనెన్స్ కారణంగా మండలంలో శనివారం ఐదు గంటలు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుంది. శనివారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో గుడివాడ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.వి.శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు.

జూదాలకు దూరంగా ఉండండి

ముదినేపల్లి రూరల్ : సంక్రాంతి సందర్భంగా కోడిపందేలు ఇతర జూదాలకు ప్రజలు దూరంగా ఉండాలని తహసీల్దార్ సుభానీ, ఎంపీడీఓ రామకృష్ణ, ఎస్ఐ వీరభద్రరావు పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించి ముదినేపల్లిలో అవగాహన ర్యాలీని శుక్రవారం నిర్వహించారు.

మండవల్లిలో..

మండవల్లి: కోడి పందేలు, జూదం వంటి వ్యసనాలకు యువత దూరంగా ఉండాలని ఎస్ఐ రామచంద్రరావు పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ కె గోపాల్, ఎంపీడీఓ రామలింగేశ్వరరావు పాల్గొన్నారు.

కోడిపందేలను అడ్డుకుంటాం

కైకలూరు: సంక్రాంతి కోడిపందేలను అడ్డుకుంటామని కైకలూరు మండల ఇన్‌చార్జి తహసీల్దారు ఎండీ ఇబ్రహీం, కైకలూరు టౌన్, కలిదిండి ఎస్ఐలు ఆర్.శ్రీను, వి.వేంకటేశ్వరరావు శుక్రవారం చెప్పారు. కైకలూరు మండలం ఆటపాక, రాచపట్నం, కలిదిండి మండలం కొండంగి, గుర్వాయిపాలెం తదితర గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు.

రేపు యువజన దినోత్సవాలు

గుడ్లవల్లేరు: స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని సింగలూరులో యువజన దినోత్సవాలను ఆదివారం నిర్వహించనున్నట్లు భాగ్యవిధాత చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ బండారు శ్యామ్ కుమార్ శుక్రవారం తెలిపారు. ఉత్సవాల సభకు ముఖ్య అతిథులుగా ఆస్ట్రేలియాకు చెందిన ప్రముఖ వైద్య నిపుణుడు డాక్టర్ పి.సాయినాథ్, హైదరాబాదుకు చెందిన డాక్టర్ జి.విజయ్ శ్రీనివాస్ విచ్చేయనున్నారని పేర్కొన్నారు.

సంక్షిప్త వార్తలు

■ సమస్యలు పరిష్కరించాలని వినతి

పామర్రు: నియోజకవర్గంలోని సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కోరుతూ పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీకి వినతి పత్రాన్ని శుక్రవారం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పాముల లంక బ్రిడ్జి, మొవ్వ మండలంలోని బ్రెయిలీ బ్రిడ్జి నిర్మాణం తదితర పనులు చేపట్టాలని కోరామన్నారు.

■ అంతర్గత రహదారికి భూమి పూజ

మొవ్వ: మండలంలోని అయ్యంకి గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.6 లక్షలతో మంజూరైన బీసీ కాలనీలో అంతర్గత రహదారికి శుక్రవారం ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా భూమి పూజ చేశారు. గ్రామ సర్పంచ్ నాగనబోయిన సునీల్, జెడ్పీటీసీ సభ్యురాలు రాజులపాటి పార్వతి, ఉప సర్పంచ్ సుబ్బారావు, పంచాయతీరాజ్ ఏఈ వాసుదేవరావు పాల్గొన్నారు. అలాగే పెదసనగల్లులో రూ.2.3లక్షల వ్యయంతో నిర్మించిన గోకులం షెడ్డును ప్రారంభించారు.

■ పంట నష్టం అక్రమాలపై అధికారుల విచారణ

తోట్లవల్లూరు: పంట నష్టం అక్రమాలపై వ్యవసాయాధికారులు స్పందించారు. గత ఏడాది సెప్టెంబర్‌లో వచ్చిన వరదలతో మండలంలోని లంకల్లో పంటలన్నీ నీటి ముంపునకు గురై దెబ్బతిన్న విషయం విదితమే. పంట నష్టం రాని పలువురు రైతులు పరిహారం జాబితాల తయారీలో అవకతవకలు జరిగాయని, అనర్హులకు పరిహారం అందిందంటూ జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో వ్యవసాయశాఖ డిప్యూటీ డైరెక్టర్ మనోహర్ స్థానిక వ్యవసాయ కార్యాలయాన్ని శుక్రవారం సందర్శించి పంట నష్టం అక్రమాలపై విచారించారు. ఏడీఏ మణిధర్, ఏఓ గీతాదేవి, ఏఓ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

■ లద్దె పురుగు నివారణకు 'బ్రహ్మాస్త్రం'

మండవల్లి: అల్లినగరంలో, ముదినేపల్లి మండల ప్రకృతి వ్యవసాయ ఇన్‌చార్జి గౌతమ్‌కుమార్ ఆధ్వర్యంలో మినుము పంటలో పొగాకు లద్దె పురుగు, పచ్చ పురుగు నివారణకు ఉపయోగించే బ్రహ్మాస్త్రం కషాయాన్ని శుక్రవారం సామూహికంగా తయారు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో అన్ని రకాల పురుగులకు నివారణకు కషాయాలు తయారు చేసి రైతులకు అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు.

సీపీడబ్ల్యూఎస్ స్కీమును పరిశీలించిన సీఈఓ



అయ్యంకిలో సంపును పరిశీలిస్తున్న సీఈఓ

అయ్యంకి(మొవ్వ): మొవ్వ మండలం అయ్యంకిలో ఏర్పాటు చేసిన 1600 కేఎం పరిమాణం గల సీపీడబ్ల్యూఎస్ స్కీమును శుక్రవారం కృష్ణా జిల్లా సీఈఓ కన్నమనాయుడు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తోట్లవల్లూరు మండలం ఐలూరు కష్టాన దిలోని జలాల నుంచి మొవ్వ, పామర్రు,పెదపారుపూడి మండలాలలోని 44 గ్రామాలకు విడుదల వుతున్న తాగునీటి సంపును అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించారు. సర్పంచ్ నాగనబోయిన సునీల్, జెట్పీటీసీ సభ్యులు రాజులపాటి పార్వతి, కూనపరెడ్డి స్వరూప, ఎంపీపీలు కొండేటి ఇందిర, దాసరి అశోక్ కుమార్, ఎంపీడీఓలు తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరాలు

గుడివాడటౌన్: సంక్రాంతి సంబరాలు పట్టణంలో పలు విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఎన్టీఆర్ స్టేడియం ఉపాధ్యక్షుడు శ్రీనివాస రావు పాల్గొన్నారు

■స్థానిక సిద్ధార్థ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్లో చిన్నారులు భోగి మంటలు, గొబ్బెమ్మలు ప్రత్యేకించి బొమ్మల కొలువు ఏర్పాటు చేశారు. సిద్ధార్థ ప్రిన్సిపాల్ చోడవరపు విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కైకలూరులో..

కైకలూరు: జాగృతి స్కూల్లో సంక్రాంతి సంబరాలు శుక్రవారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ పానం జయ కిషోర్‌బాబు ఆధ్వర్యంలో చిన్నారులు సందడి చేశారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, కూటమి నేతలు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్యాలు

గుడ్లవల్లేరు: యువజనోత్సవాలను పురస్కరించుకుని గుడ్లవల్లేరు వీవీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కాలేజీలో శుక్రవారం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు సందడి చేశాయి. ఈ వేడుకల్లో విద్యార్థులు ప్రదర్శించిన సంప్రదాయ, సాంస్కృతిక నృత్యాలు అలరించాయి. ఈ కార్యక్రమాన్ని జీఈసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.కరుణకుమార్ ప్రారంభించారు.

కళాశిల్క్ ప్రదర్శనకు విశేష స్పందన



చేనేత హస్తకళా ప్రదర్శనలో దుస్తులు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

గుడివాడరూరల్: పట్టణంలోని బస్టాండ్ సమీపంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కళాశిల్క్ చేనేత హస్తకళ ప్రదర్శనకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఈ మేళాలో పట్టు, ఫ్యాన్సీ డిజైన్, పోచంపల్లి చీరలు, డ్రెస్ మెటీరియల్స్, చుడీదార్స్, సూటింగ్, షర్టింగ్స్, జువెల్లరీ, బెడ్‌షీట్స్ అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. అలాగే ధర్మవరం, వెంకటగిరి, మంగళగిరి, కలంకారి, ఉప్పాడల్లో ప్రఖ్యాతి పొందిన చీరలు ఇక్కడ ఉన్నాయన్నారు. హరియానా బెడ్ కవర్లు, కుషన్ కవర్లు, లక్నో కుర్తీస్, డ్రెస్ మెటీరియల్స్, డోర్ కర్టన్స్, స్టోన్ జువెల్లరీ, పెరల్స్, క్రాఫ్ట్స్ బంజారా, కోల్‌కతా బ్యాగులు, ఒడిశా పెయింటింగ్స్, మధ్యప్రదేశ్ చందేరి, మహేశ్వరి, రాజస్థాన్ కోటా బాందేజన్, బ్లాక్‌ప్రింట్స్, సంగ్నరి ప్రింట్స్, డ్రెస్ మెటీరియల్స్, ఉత్తరప్రదేశ్ జామ్దాని, బనారస్ లక్నోవి మెటీరియల్స్ విక్రయిస్తున్నట్లు తెలిపారు. పలు రకాల వస్తువులు సరసమైన ధరలకు లభిస్తాయని పేర్కొన్నారు.